# దివాలి

●

“సహేంశ్వర్”

●

కుప్పించి ఎగిసే * 'కుంపీ'లవంకా గిరగిరా తిరిగే విష్ణుచక్రాలవంకా తదేకదీక్షతో చూస్తోంది మా (కాబోయే) ఆవిడ!

నాకు కాబోయ్యే ఆవిడపేరు కుసుమకుమారి. దేవుడిమీద దేవుడి పేర్లమీద నాకున్న అసహ్యంవల్ల కుసుమకుమారిని 'సుకుమారి'గా మార్చుకున్నాను. కుసుమాలకన్న సుందరంగా మృదువుగావుండే ఆమెని కుసుమసుకుమారి అంటే ఇంకా బావుండేది! మా ఆవిడ అందం నేనిప్పుడే రాయకూడదు—'మా ఆవిడ' అనే హక్కు నాకింకా రాలేదుకనక—మతాబా వెల్గులు ఆమె కళ్లలోపడి అనేకరంగులుగా మారి 'రిఫ్లెక్ట్' అవుతున్నాయి.

దీపాలవెలుగుల్లో దివ్యంగా మెరుస్తోంది మా సుకుమారి- వీధంతా సందడిగా వెలిగిపోతోంది!

“ఏవండీ- నేనూ ఓ మతాబా వెలిగిస్తాను” అంది అతి సరదాగా.

“పెళ్లికానీ వెలిగిద్దుగాని!” అన్నాను.

ఒక్క బాంబు—ఢాం...!

సుకుమారి రెండు చెవులు మూసుకుంది!

ఒయ్యారంగా మీద కెగపాకుతోంది తారాజువ్వ-ఔత్ కానాలకన్న ఎత్తుగా ఎగురుతున్నాయ్ మందార కుంపీలు- వెనువెంట నే కుంగిపోతున్నాయ్-పసిపాపల హృదయాలు పొంగిపోతున్నాయ్-!

మా ఆవిడ లోనికెళ్లి పాన్పుపై పవ్వళించింది! వెళ్లి తెయ్యారించి తీసుకొచ్చి ఓ మతాబా కాల్పించాలి! కాని ఆమెనిపిలిచే ధైర్యంలేదు. కారణం: “పెళ్లి కాకుండా వున్నప్పుడే ఇలా ఒకారి కొకరు రాసుకుతిరుగుతున్నారు—పెళ్లయితే ఇహ స్వర్గంలో తిరుగుతారు” అనేది మా అత్తగారు, అన్ని ముచ్చట్లూ ఆవిడకు తీరిపోయేయికనక!

ఎలా ఐతేనేం డేర్ చేసి మా ఆవిడ అభ్యంతర మందిరానికి వెళ్లి లోనికి తొంగిచూసేను.

---

* 'కుంపీ' నేకొన్ని జిల్లాలలో చిచ్చుబుడ్డీ అని వాడుతారు:

వీధిలో మరో బాంబ్ పేలింది- ఢాం—! గదిలో దీపం ఆరిపోయింది! తడువుకుంటూ మంచం దగ్గరకెళ్లేను. ఉలుకూపలుకూ లేదు. తెలిసుండి నిద్దర నటించేవాళ్ళని లేపడం కష్టం!

“మతాబా వెలిగిస్తావా?” అన్నాను.

“పెళ్ళికానీ వెలిగిద్దుగాని—”

ఎవరది? సుకుమారి కాదు- వాళ్ళమ్మ!! కిటికీలోంచి తెల్లమతాబా వెలుగు కనబడింది.

మా వెలుగులలక్ష్మి ఇవతలేవుంది- కాకర పువ్వులు కాలుస్తోంది- నన్ను చూచి ఏదోమాదిరిగా నవ్వి “కుంపీ వెలిగిస్తానండీ” అంది.

“జెయ్యి కాల్చుకుంటావ్” అన్నాను.

“ఓస్—నా చిన్నప్పుడు ఏకొదమైన ఏభై కుంపీలు కాల్చేసు—” అంటూ బుట్టలోంచి ఓ కుంపీ తీసి గుమ్మానికెదురుగా ఉంచింది- ఓ కాకరపువ్వొత్తి వెలిగించి ఒయ్యారంగావొంగుని కుంపీ మూతికి ముట్టించింది- గంజికం అంటుకుంటుంది—బుస్—మని ఒక్క ఎగురు- దాంతో ఆవిడ మొహం కాలి ఊరుకుంది- కుంపీ పేలిపోయింది పొగ విరజిమ్మింది.

అమ్మో- అంటూ వెనక్కి తిరగబడింది- నింపాదిగా లోనికితీసుకెళ్లి మంచంపైపడుకో బెట్టి సపర్యలు ఆరంభించడమైంది.

మొహం అంతా భాగా ఉడికిపోయింది- వంకాయలా కమిలి ఊరుకుంది.

మంట ఎక్కువకాజొచ్చింది- నవనీతం పూసి వింజామర పట్టడమైంది- తెలతెల్లగా పొక్కులులేవనారంభించేయి- అందవికారం అయి ఊరుకుంది.

“ఒద్దన్నపని ఓలాయిస్తే ఏమౌతుంది!” అంది అత్తగారు.

“ఏకొదమైన ఏభై కుంపీలు కాల్చినవాళ్లకిదో లెఖ్ఖ” అన్నాను.

“చాల్లెండి వేళాకోళం— పట్టింపులేని కుంపీలు తెచ్చి...” అంది ఆవిడ.

మా ఆవిడ మహా అందమైంది- అని చెప్పకో లేకుండా అయిపోయింది- మా ఆవిడ, మొహం మీదే ఓ కావ్యం రాద్దమనుకు నేసరికల్లా ఈ విపత్తు సంభవించింది.

“నా మొహం అందవికారం ఐందికదూ!?” అంది సుకుమారి.

"అబ్బే—నీ రంగు పెదవుల కాకాల్వు ఓ నూత్న రంగుల్ని పెయింట్ చేసింది—" అన్నా.

"ఏదో సంతృప్తిపర్చటానికలా అంటున్నారు. మరి నన్ను పెళ్లి చేసుకోరుకదూ !" అంది నిస్పృహగా !

"నుగెప్పుడూ కుంపీ వెలిగించవే కద !"

నా మొహం వెలిగించుకున్నాను- ఏదీ అద్దం ఓసారి తేరూ ?"

నీ అందానికేం లోటులేదు-అద్దం అవసరం లేదు-"

"పోనీ నన్ను పెళ్లాడుతారా ?"

"ఇప్పుడేనా ? మీ అమ్మనిపిలుస్తా ఉండు-"

"పోనీండి మీకంతకష్టంగా ఉంటే మరి మాట్లాడను-"

"అబ్బే- నిన్ను తప్పకుండా చేసుకుంటాను- ఇదివరకందంగావున్నప్పుడు నిన్నెవరేనా ఎత్తుకుపోతారేమో అన్న భయంవేసేది. ఇప్పుడా భయం తీరిపోయింది- మరి ఇహ నేనుతప్ప మరెవ్వరూ ఎత్తుకెళ్ళరు !"

నాగులచవితి — సుకుమారి కాస్త తేరుకుంది- ఇంకా మచ్చలుపొక్కులూ తగ్గలేదు. కాని నాతో మునటిమల్లే తిరగలేదు- ఏదో అమూల్యమైన వస్తువు పోగొట్టుకున్నదాని మల్లే ఫీలౌతోంది- ఓ పక్క పెళ్లాడనేమో అనే భయం- రెండోపక్క తన అందం అంతరించిందనే దిగులూ—!

పుట్టలోపాలోయ్యడానికి సకుటుంబ సపరివార సమేతంగా బయల్దేరాం, తోటకి- నేనో పెద్ద పుట్ట సెలక్ట్ చేసేను. అంతా పాలుపోసేం- మందుగుండు సామానుకాల్చే వేళ సమీపించింది.

"వెల్గించవోయ్ ఓ, కుంపీ" అంది మా అత్తగారు.

"పెళ్ళవనీ అత్తయ్యా వెలిగిస్తాం !" అన్నాను.

"బాగానే అంటించేవే !" అంది మా అమ్మ, మతాబా వెలిగిస్తూన్న సుకుమారివొంక చూస్తూ!

"నాకన్నా మీ అమ్మాయి బాగా వెలిగిస్తుంది—" అన్నాను.

పుట్టవెనకనుండి బుస్‌మంది — "అమ్మోం- పాం- అంది మా అత్తగారు.

పాముకాదు- ఎవరో అప్పుడే వెలిగించిన కుంపీ శబ్దం—!!

సుకుమారిచేతులో పచ్చమతాబా వెలిగి ఆరిపోయింది !

* * *

దీపావళి వెలుగులు ములుగుతున్నాయ్. యుద్ధంవల్లనైతేనేం- సామాను సరఫరా తగ్గిపోడంవల్లనైతేనేం- దివాలీజ్యోతి దిగనాయిస్తున్నాయ్. మామూలుగా మా సుకుమారి చేతులో విష్ణుచక్రం తిరుగుతోంది-"అమ్మా- నేనో" అంటూ మా నాలుగేళ్ళ చిట్టిగాడు చెయ్యిచాస్తున్నాడు-ఎదటివాకిట్లో గేస్‌లైట్ తీగవెలిగింది వెన్నముద్దలా- మా సుకుమారిముఖం మామూలుకన్న అందంగా కన్పిస్తోంది.

ఎగువీధిలో ఔట్ ధనేల్‌మంది. ఈ రోజుల్లో దాన్ని ఔట్ అనకూడదు...మరేమనాలి ?

దేశవాళీ బాంబు !

---

## స్వీకారం

### 'పడోసీ' మాసపత్రిక

ఇప్పటికి 'పడోసీ' మాసపత్రిక 3 సంచికలు మా కార్యాలయం చేరాయి. విఖ్యాత డైరక్టరు శాంతారాం హిందూ ముస్లిం సమ్మేళనాన్ని ఆశించి 'పడోసి' చిత్రం నిర్మించినట్లే సోదరులు మొహమ్మద్ అకిల్ అలి. సి. హెచ్. చంద్రశేఖరంగార్లు భారతదేశపు సమస్యల్లో విశేష ప్రాధాన్యంవహించే హిందూ ముస్లిం సఖ్యతనాదర్శంగా గొని యీ 'పడోసీ' మాసపత్రిక ప్రకటిస్తున్నారు. రచనలు హైందవ ముస్లిం సౌహార్దాభివృద్ధి నాకాంక్షించేవి మాత్రమే గాక, యితర వ్యాసాలు, మనోజ్ఞమైన కథలు, స్త్రీలకు ప్రత్యేక వ్యాసాలు ఉన్నై. భారత జాతీయైక్యత అవసరమైన యీ రోజుల్లో ఇలాంటి పత్రికల ప్రయోజనం అమూల్యంఅని చెప్పవచ్చు. ప్రకాశకులు యీ ప్రయత్నం నిర్విఘ్నంగా కొనసాగాలని మా కోరిక. విడి సంచికలు 0-1-3. సాలినీ చందా ఒక రూపాయి. తలసినవారు ఎడిటర్ "పడోసి" పుంగనూర్, చిత్తూరుజిల్లాఅని వ్రాయాలి.